# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

గురువారం | 01 జనవరి , 2026 | పేజీలు : 06




వివరాలు మెయిన్‌లో

నిరంతర పోరాట శీలి బోడ సుదర్శన్‌కు ఘననివాళి

# మతోన్మాదులతోనే దేశానికి ప్రమాదం

### సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి



**ప్రజాపక్షం/వలిగొండ:** మోదీ ప్రభుత్వం వచ్చిన తరువాత పేదరికం, నిరుద్యోగం రెట్టింపు అయ్యాయని, ఇండ్లు లేని నిరుపేదలు పెరిగి పోయారని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి విమర్శించారు. వలిగొండ మండలం వేములకొండ గ్రామంలో జరిగిన సిపిఐ జిల్లా కార్యవర్గం మరియు కౌన్సిల్ సమావేశానికి పల్లా వెంకట్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రధాని మోడీ దృష్టి అంతా కార్పొరేట్ శక్తుల పైనే ఉండడంతో పేదల సంక్షేమాన్ని పట్టించుకోవడంలేదని అన్నారు. దేశంలో మతోన్మాదాన్ని పెంచి పోషించిన బిజెపి యుద్ధోన్మాదానికి కూడా తెరలేపిందని, మతోన్మాదులు, యుద్ధోన్మాదులతో దేశానికి ప్రమాదకరం అని అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం పేరు మీద ధనస్వామ్యం, భూస్వామ్యం, ఫాసిజం రాజ్యమేలుతున్నాయని ధ్వజమెత్తారు. దేశభక్తి ముసుగులో బీజేపీ కార్పొరేట్ వర్గాలకు దేశ సంపదను దోచిపెడుతున్నదన్నారు. కోట్ల సంవత్సరాలు చరిత్ర కలిగిన అరావళి పర్వతాలను ఆదాని మైనింగ్ కంపెనీకి బిజెపి ప్రభుత్వం కట్టబెడుతున్నదని విమర్శించారు. ప్రకృతిని, పర్యావరణాన్ని ధ్వంసం చేస్తూ దేశ సంపదను, సహజ వనరులను కార్పొరేట్ వర్గాలకు దోచి పెడుతున్న బీజేపీ ప్రభుత్వం చర్యలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. సీపీఐ వందేళ్ల ఉత్సవాల సందర్భంగా జనవరి 18న ఖమ్మంలో ఐదు లక్షల మంది ప్రజలతో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ బహిరంగ సభకు జిల్లా నుండి వేలాది మంది తరలి రావాలని పిలుపునిచ్చారు.

**18న ఖమ్మంలో జరిగే భారీ బహిరంగసభ**

సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ జనవరి 18న సిపిఐ శత వార్షికోత్సవాల ముగింపు ఉత్సవాలలో భాగంగా ఖమ్మంలో జరిగే భారీ బహిరంగ సభ అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. జిల్లాలో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచ్లు, వార్డు సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చన గౌని గాలయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, సహాయ కార్యదర్శులు బోలగాని సత్యనారాయణ, చేడే చంద్రయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గోద శ్రీరాములు, కురిమిద్ద శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, ఎండీ ఇమ్రాన్, ఉప్పల ముత్యాలు, పల్లె శేఖర్ రెడ్డి, పెరబోయిన మహేందర్, ఏశాల అశోక్, చిగుళ్ల లింగం, చేనేత సంఘం రాష్ట్ర కార్యదర్శి పాశి కంటి లక్ష్మీనరసయ్య, సిపిఐ మండల కార్యదర్శి సలిగంజి వీరస్వామి, జిల్లా కమిటీ సభ్యులు ఎలగందుల అంజయ్య, ఎల్లంకి మహేష్, గాదెగాని మాణిక్యం, అన్నెపు వెంకట్, దుబ్బాక భాస్కర్, కలకొండ సంజీవ, మారుపాక వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాజేష్ మృతిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలి

### ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ




**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** కోదాడలో దళితుడైన కర్ల రాజేష్ మృతిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. కర్ల రాజేష్ మృతికి కారణమైన చిలూకురు ఎస్ఐ సురేష్ రెడ్డిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. బుధవారం సూర్యాపేట జిల్లా కలెక్టర్‌ను కలెక్టర్ కార్యాలయం నందు కలిసి రాజేష్ మృతికి కారణమైన చిలుకూరు ఎస్ఐపై చర్యలు చేపట్టాలని, మృతదేహాన్ని రిపోస్టుమార్టం చేయాలని కోరుతూ మృతుడి కుటుంబ సభ్యులతో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చిలుకూరు ఎస్ఐని కోదాడ శాసనసభ్యురాలు ఉత్తమ్ పద్మావతి రెడ్డి కాపాడుతున్నారని ఆరోపించారు. మృతికి కారకుడైన ఎస్ఐ సురేష్ రెడ్డిని సస్పెండ్ చేయాలని, కారకులైన సిఐ, డిఎస్‌పిలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోస్టుమార్టం చేసిన వారు వీడియో తీసిన వారు అగ్రకులానికి చెందిన వారేనని మండిపడ్డారు. జనవరి నెల 10వ తేదీన కోదాడలో కర్ల రాజేష్ సంతాప సభ నిర్వహించి, రాష్ట్రవ్యాప్తంగా దళిత సంఘాలు, సామాజిక న్యాయం కోరే ప్రజాసంఘాలతో తమ పోరాటం ఉధృతం చేస్తామని తెలిపారు. రాజేష్ నవంబర్ 16న మృతి చెందారని డిసెంబర్ 31 వరకు కూడా కుట్రలు చేసి కేసును కనుమరుగు చేసేలా జైభీమ్ సినిమా కథ మాదిరిగా రాజేష్ లాకప్ డెత్ అనంతరం పోలీసుల వ్యవహారశైలి ఉందన్నారు. నిపుణులైన ఫోరెన్సిక్ వైద్యులచే రీ పోస్టుమార్టం నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

## సూర్యాపేట జిల్లాలో సరిపడ ఎరువులు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** జిల్లాలో రైతులకు సరిపడా యూరియా ఉందని రైతులు అవసరానికి మించి ఎరువులు తీసుకోరాదని రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ బి నరసింహారావు అన్నారు. బుధవారం మండలంలోని మన గ్రోమోర్ సెంటర్‌తో వివిధ ఎరువుల డీలర్ షాపులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన యూరియా అమ్మకాలు రైతులకు ఏ విధంగా జరుగుతుందని రైతుల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు సిఫార్సు మేరకు ఎరువులు తీసుకోవాలని రైతులను కోరారు. యాసంగి 2025 సీజన్‌కు ప్రస్తుతం జిల్లాలో 9826 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు సరఫరా చేయుటకు వివిధ సొసైటీలు, డీలర్లు, ఎన్‌డిసిఎంఎస్, ఏఆర్ఎస్‌కె మార్క్‌ఫెడ్ గోదాంలలో అందుబాటులో ఉందని చెప్పారు. ఈ రోజు వరకు 34731 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. యాసంగి 2025 సీజన్‌కు గాను సూర్యాపేట జిల్లాలోని రైతులకు సకాలంలో ఎరువులు, సరఫరా చేయుటకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉంచేవిధంగా ప్రభుత్వం అన్ని కేంద్రాల్లో యూరియా నిల్వలను ఉంచుతున్నామన్నారు. సీజన్‌కు సరిపడ ఎరువులు అందుబాటులో ఉన్నాయని జిల్లాలో 544 సెంటర్ల ద్వారా యూరియా పంపిణీ చేయుటకు ఏర్పాట్లు చేయడం జరిగిందని చెప్పారు. రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి కృష్ణ సందీప్, ఏఓ టెక్నికల్ సునిత, ఎరువుల డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

## నూతన సంవత్సర శుభాకాంక్షలు

### మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ :** నూతనప్రజాపక్షం/నల్లగొండ : నూతన సంవత్సరం 2026 సందర్భంగా రాష్ట్ర రోడ్లు, భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి గారు తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.కొత్త సంవత్సరం ప్రతి కుటుంబానికి ఆరోగ్యం,ఆనందం,శాంతి, సమృద్ధి తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.ప్రజల విశ్వాసంతో ముందుకు సాగుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం, సమానత్వం అనే లక్ష్యాలతో మరింత వేగంగా పనిచేస్తుందని మంత్రి పేర్కొన్నారు.ప్రతి గ్రామానికి మెరుగైన మౌలిక వసతులు,నాణ్యమైన రహదారులు, యువతకు ఉపాధి అవకాశాలు,రైతులకు భరోసా కల్పించే విధానాలతో తెలంగాణను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు.నూతన సంవత్సరం ప్రజల ఆశలు,ఆకాంక్షలను సాకారం చేసే సంవత్సరంగా నిలవాలని, ప్రజలందరి సహకారంతో తెలంగాణను ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు.

### మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట :** ఆంగ్లనామ నూతన సంవత్సరంలో సరికొత్త ఆలోచనలతో ప్రజలు ముందుకు సాగాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో ఆకాంక్షించారు. 2026 నూతన సంవత్సరం అంతా శుభమే జరగాలన్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ఇంట్లోనే వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని, అందరి జీవితాల్లో మరిన్ని వెలుగులు నిండాలని తెలిపారు.

### యాదాద్రి భువనగిరిజిల్లా కలెక్టర్ హనుమంతరావు



**ప్రజాపక్షం/యాదాద్రి :** ఆంగ్ల నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని జిల్లా ప్రజలకు యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు శుభాకాంక్షలు తెలిపారు. 2026వ సంవత్సరం ప్రతి ఒక్కరికి శుభాలను చేకూర్చాలని, ప్రతి కుటుంబంలో ఆనందంతో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. జిల్లా ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని అభిలషించారు. తనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు బొకేలు, పుష్ప గుచ్చాలు, శాలువాలు తేవొద్దని జిల్లా కలెక్టర్ హనుమంత రావు తెలిపారు.

### సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె నరసింహ



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** 2026 సంవత్సరంలో ప్రజలందరికి శుభం కలుగాలని జిల్లా పోలీసు శాఖ తరపున నూతన సంవత్సర శుభాకాంక్షలు జిల్లా ఎస్‌పి కె నరసింహ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో ముందుకెళ్తామన్నారు. డ్రగ్స్ రహిత జిల్లాగా చేయడానికి, రోడ్డు ప్రమాదాలు నిర్మూలించడానికి, సైబర్ నేరాలు నిరోధించడానికి, మహిళల భద్రతకు ప్రాధాన్యమిస్తూ పని చేస్తామని పేర్కొన్నారు.

### నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



**ప్రజాపక్షం/నకిరేకల్ :** నియోజకవర్గ ప్రజలకు ఆంగ్ల నూతన సంవత్సర సందర్భంగా నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొత్త ఏడాదిలో సరికొత్త ఆలోచనలు, ఆశయాలు, లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వం లో 2025 లో రాష్ట్రం అన్ని రంగాల్లో పురోగతి సాధించామని గుర్తు చేశారు.ఈ సంవత్సరం కూడా అదే స్పూర్తితో అన్ని రంగాల్లో రాష్ట్రాన్నీ పురోభివృద్ధి సాధించి ఆదర్శంగా నిలుపుతాం అన్నారు. 2026లోకి అడుగుపెడుతున్న రాష్ట్ర ప్రజలకు శుభం కలగాలని కోరుతూ అందరికీ ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.



## కర్ల రాజేష్ మృతుకి కారకులైన వారిని వెంటనే విధుల చేయాలి

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** కర్లరాజేష్ మృతుకి కారకులైన చిలుకూరు ఎస్ఐ సురేష్‌రెడ్డి, పోలీస్ సిబ్బందిని విధుల నుండి తొలగించి, వారిపై అట్రాసిటి కేసు నమోదు చేయాలని జిల్లా ఎంఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడవల్లి చంద్రయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు కొత్తపల్లి రవి లు అన్నారు. బుధవారం తహసిల్దార్ కార్యాలయం ముందు రిలేనిరహర దీక్షలు చేపట్టారు. ప్రభుత్వం కర్ల రాజేష్ కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ రిలే నిరహరదీక్షలో ఎమ్మార్పీఎస్ నాయకులు దూరే వినోద్, పిట్ట వెంకటేష్, రేవూరు సాయికిరణ్, అల్లం పల్లి శేఖర్, నకిరేకంటి రవి, పెండ వినోద్, మచ్చ వేణు, సందాల సైదులు, నగేష్, రాము పాల్గొన్నారు.

## ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేయాలి



**ప్రజాపక్షం/మునగాల:** ప్రతిరైతు ప్రకృతి వ్యవసాయం ఒక అర ఎకరంలో చేపట్టాలని వ్యవసాయ సామాజిక కార్యకర్త, కిసాన్ సేవారత్న పురస్కారం గ్రహిత డాక్టర్ మొలుగూరి గోపయ్య కోరారు. బుధవారం మండల పరిధిలోని కలకోవ, విజయరాఘవపురం, రేపాల, సీతానగరం, నర్సింహులగూడెం, జగన్నాథపురం గ్రామాలో తాను స్వచ్ఛందంగా చేపట్టిన ప్రకృతి వ్యవసాయంపై రైతు చైతన్య యాత్ర కార్యక్రమంలో ఆయన రైతులతో మాట్లాడారు. ప్రస్తుతం పోటీ ప్రపంచంలో సాగులో అనేక మార్పులు వచ్చాయని, దీంతో ప్రజలు అనేక జబ్బులతో బాధపడుతున్నారని అన్నారు. నేల అరోగ్యమే పంట అరోగ్యమని, సహజ సిద్ద పద్దతులతో చీడ పీడల నివారణ, భూసారంపై అవగాహన కల్పించారు. ప్రస్తుతం రబీ సీజన్‌లో ప్రతి రైతు కుటుంబ ఆరోగ్య అవసరాల కోసం ప్రకృతి వ్యవసాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతే మనందరి ధ్యేయం

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** గ్రామ పంచాయతీలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడమే మనందరి ధ్యేయమని సర్పంచ్ బచ్చలకూర శ్రీను అన్నారు. బుధవారం మండలంలోని కల్మల్ చెర్వు గ్రామంలో అపరిశుభ్రంగా ఉన్న డ్రైనేజీలలో పేరుకుపోయిన చెత్తచెదారంను దగ్గర ఉండి గ్రామ సిబ్బందితో తొలగించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ఎలుగూరి సత్యనారాయణరెడ్డి, గంధం యల్లయ్య, షేక్ జాని మియా, కాలనీ వాసులు, ప్రజలు పాల్గొన్నారు.



## బరాఖత్‌గూడెం గ్రామ పాలకవర్గాన్ని అభినందన



**ప్రజాపక్షం/మునగాల:** స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీపై బిఆర్ఎస్, టిడిపి బలపర్చిన సర్పంచ్ చల్లా గురవయ్య అత్యాధిక మెజార్టీతో గెలుపొంది నూతనంగా ప్రమాణం స్వీకారం చేసిన నూతన పాలకవర్గాన్ని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో అధికారంలోకి వచ్చేది బిఆర్ఎస్ పార్టీ అధినేత కెసిఆర్ అని జోస్యం చెప్పారు. గ్రామంలో సర్పంచ్‌గా మంచిపేరు ప్రఖ్యాతులు తెచ్చుకుని గ్రామాభివృద్ధి వైపు అడుగులు వేయాలని ఆకాంక్షించారు. రానున్న రెండేళ్లలో మళ్లి అధికారంలోకి వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చల్లా గురవయ్య, ఉప సర్పంచ్ వేనేపల్లి శైలజరమేష్‌బాబు, నాయకులు బొంతు మోహన్‌రావు, గోలి పూర్ణశంకర్, వార్డు మెంబర్లు కుందురు పుల్లారెడ్డి, వట్టె లింగరాజు, రమనబోయిన రమేష్, నెమ్మాది వెంకన్న పాల్గొన్నారు.

## రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిది



**ప్రజాపక్షం/ రామన్నపేట:** మన రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాల్సిన బాద్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మామిడి వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు యాదాసు యాదయ్య, ప్రధాన కార్యదర్శి నకిరేకంటి మొగులయ్యలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియచేస్తూ సేవ్ డెమోక్రసీ సేవ్ కాన్‌స్టిట్యూషన్ అనే నినాదంతో ఐలు ముద్రించిన పాకెట్ క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. న్యాయవాదులకు ఇచ్చే ఇన్సూరెన్స్ రూ.2లక్షలు సరిపోవడంతో లేదని రూ.5లక్షలకు పెంచాలని, న్యాయవాదులకు హెల్త్‌కార్డులు అందించాలని, జూనియర్ న్యాయవాదులకు రూ.10వేల స్టైఫండ్ అందించాలని, జిల్లాలో ఉన్న కోర్టుల్లో ఖాళీగా ఉన్న ఆఫీసర్లు, ఉద్యోగులను భర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు ఉయ్యాల హనుమంతుగౌడ్, కేమ రామదాసు, పాల్వంచ జగతయ్య, గడ్డం నరసింహా,జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల సేవలు అమూల్యమైనవి



**ప్రజాపక్షం/చిట్యాల:** అంగన్‌వాడీ టీచర్లు అందిస్తున్న సేవలు సమాజానికి చాలా అమూల్యమైనవని ఐసిడిఎస్ సిపిడిఓ లావణ్యకుమారి అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండల పరిధిలో పదవీ విరమణ పొందిన టీచర్లకు ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గత 23 సంవత్సరాలుగా అంగన్‌వాడీ పిల్లలకు, తల్లులకు ఇతర సామాజిక సేవలు అందించి పదవీ విరమణ పొందుతున్న టీచర్లు అభినందనీయులని అన్నారు. భవిష్యత్తులో కూడా సమాజ సేవలో వారు పాలు పంచుకోవాలని లావణ్య కుమారి ఆకాంక్షించారు. పదవీ విరమణ పొందిన ఉరుమడ్ల, వెంకటాపురం, చిట్యాల అంగన్‌వాడీ టీచర్లు సాగర్ల భానుశ్రీ, కొలను పుష్పలత, షంశున్నీసాబేగంలను ఆమె శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ఏసిడిపిఓ వెంకటమ్మ, సూపర్‌వైజర్ సునిత, అంగన్‌వాడీ టీచర్లు దాడి అరుణ, అపర్ణ, బుజ్జమ్మ, జ్యోతి, శోభారాణి, కృష్ణవేణి, లలిత, అంజమ్మ, మంగమ్మ, నాగమణి, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కొనుగోలు పారదర్శకం



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రైతుల ప్రయోజనాల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్ ద్వారా యూరియా కొనుగోలు సులభం, పారదర్శకంగా జరుగుతుందని, యాప్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి ఏడీఏ ధీరావత్ సైదానాయక్ అన్నారు. బుధవారం ఆయన మండలంలోని పలు ఎరువుల దుకాణాలను సందర్శించి రికార్డులను పరిశీలించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ యాప్ ద్వారా రైతులు ఇంటి వద్ద నుంచే యూరియాను బుకింగ్ చేసుకోవచ్చని అన్నారు. 0 నుంచి ఒక ఎకరం ఉన్న రైతులకు ఒక దఫా, రెండు నుంచి ఐదు ఎ కరాలు ఉన్న వారికి రెండు దఫాలు, ఐదు ఎకరాలకు పైబడి ఉన్న రైతులకు మూడు దఫాలుగా ఈ యాప్ ద్వారా యూరియా సరఫరా అందుబాటులో ఉంటుందన్నారు. యాప్‌లో ఎలాంటి సాంకేతిక సమస్య వచ్చినా ఏవోలు, ఏఈవోలను సంప్రదించి పరిష్కరించుకోవచ్చన్నారు. రైతుల ప్రయోజనాల కోసమే ప్రభుత్వం ఈ యాప్ ప్రవేశట్టిందని రైతులు ఎలాంటి ఆందోళన చెందకుండా ఈ యాప్‌ను విశ్వాసంతో వినియోగించి యూరియా పొందాలన్నారు. అదేవిధంగా రైతులు మాట్లాడుతూ ఈ యాప్ ద్వారా తాము గతంలో లాగా లైన్‌లో నిల్చొకుండా ఇంటి వద్ద నుంచే యూరియాను బుకింగ్ చేసుకోని నేరుగా వెళ్లి యూరియా తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఏఈవో షఫి, మాలావత్ రమేష్‌నాయక్, రైతులు ఉన్నారు.

## దరఖాస్తు పొడగింపు

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** 2025/26 విద్యా సంవత్సరానికి గాను జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో వివిధ కోర్సులలో విద్యనభ్యసిస్తున్న అర్హులైన ఎస్‌సి విద్యార్థులకు పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేది. 31.12.2025 నుండి 31.03.2026 వరకు పొడిగించారని జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి కె దయానంద రాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని అందరూ గమనించి ఉపకారవేతనాల నమోదు ప్రక్రియ కోసం ఈ పాస్ వెబ్‌సైట్ నందు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.



## పారిశుద్ధ్య కార్మికుడిగా మారిన సర్పంచ్ సాయిబాబా

**ప్రజాపక్షం/తుంగతుర్తి :** మండల కేంద్రంలోని మొదటి వార్డులో, వార్డు మెంబర్లతో కలిసి స్వయంగా తానే పారపట్టి పారిశుద్ధ్య కార్మికుడిగా మారి, మురికి కాల్వలను సర్పంచ్ మల్లెపాక సాయిబాబా బుధవారం పరిశుభ్రం చేశారు. మురికి కాల్వల్లో మొత్తం చెత్తాచెదారంతో నిండిపోవడంతో పారతో కలిసి శుభ్రం చేయడంతో వార్డు ప్రజలు వారిని చూసి సంతోషం వ్యక్తం చేశారు. పారిశుద్ధ్యంలో తుంగతుర్తి పట్టణాన్ని, అభివృద్ధిలో ఆదర్శ గ్రామముగా, కృషి చేయుటకు గ్రామ ప్రజలు, యువత పాలుపంచుకోవాలని కోరారు. గ్రామ పంచాయితీ సిబ్బంది అంకితభావంతో పని చేయాలని కోరారు. ప్రతి సర్పంచ్ కష్టపడి ముందుకు సాగితే మండలం అభివృద్ధిలో ముందంజ వేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎనగందుల శ్రీనివాస్, వార్డు మెంబర్లు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు భోజనం



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** కీతవారి గూడెం జడ్పి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు పిట్టల నాగేశ్వరావు కుమార్తె వివాహ దినోత్సవం సందర్భంగా బుధవారం పాఠశాల విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేయడం అభినందనీయమని గ్రామ సర్పంచ్ బొల్లపల్లి రామనాథం అన్నారు. బుధవారం మండల పరిధిలోని కీతవారిగూడెం పాఠశాల విద్యార్థులకు భోజనం వడ్డించి అనంతరం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు దాసరి శ్రీనివాసరావు, సంకబుడ్డి నర్సయ్య, బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షులు పొలంపల్లి ఆనంద్‌బాబు, హుజూర్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటి మాజీ డైరెక్టర్ పిడమర్తి అంజి పాల్గొన్నారు.

## వివాహ ప్రోత్సహక పథకాన్ని వినియోగించుకోవాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** దివ్యాంగుల ఆర్థికాభివృద్ధి కోసం అందించే వివాహ ప్రోత్సహక పథకాన్ని వినియోగించుకోవాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి కె నరసింహరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దివ్యాంగులను సకాలంగులు వివాహం చేసుకుంటే తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న రూ.1లక్ష వివాహ ప్రోత్సహక బహుమతిని దివ్యాంగులు దివ్యాంగులను వివాహం చేసుకున్నా కూడా మంజూరు చేయడానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. తేది.19.05.2025 తరువాత వివాహం చేసుకున్న అట్టి అర్హులైన దంపతులు ఈపాస్ వెబ్‌సైట్ నందు వివాహం జరిగిన ఏడాది లోపు దరఖాస్తు చేసుకొని, సంబంధిత సమగ్ర శిశు సంక్షేమ అభివృద్ధి అధికారి కార్యాలయంలో దరఖాస్తు ఫారంను సమర్పించాలని కోరారు.

## జనవరి 3న జనంబాటకు రానున్న కవిత

**ప్రజాపక్షం/అర్వపల్లి :** జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జనవరి 3న అర్వపల్లికి వస్తున్నారని తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షురాలు ఎస్ కృష్ణవేణి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో జాగృతి రాష్ట్ర నాయకులు సయ్యద్ ఇస్మాయిల్‌తో కలిసి మీడియా మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా జనంబాట పేరుతో చేపట్టిన పర్యటనలో భాగంగా సూర్యాపేట జిల్లాలో పర్యటించనున్నారని తుంగతుర్తి నియోజకవర్గంలో ప్రధాన సమస్యలపై దృష్టి సారించి వాటి పరిష్కారం కోసం ప్రభుత్వంపై వత్తిడి తేవడం కోసం కవితక్క కృషి చేస్తున్నారని అన్నారు. కస్తూర్బా పాఠశాలను ఈ సందర్భంగా సందర్శించిన జాగృతి నేతలు కవిత పర్యటన విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సామ అంజిరెడ్డి, నక్రికంటి చిరంజీవి, వెంకట్, మధు, రమణ, యాదగిరి పాల్గొన్నారు.



## ఎంపిడిఓకు సన్మానం

**ప్రజాపక్షం/అర్వపల్లి** : మండల ఎంపిడిఓ పల్లపు ఝాన్సీని రామన్నగూడెం గ్రామ సర్పంచ్ కర్నాటి వెంకన్న ఆధ్వర్యంలో వార్డు సభ్యులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రవీందర్, వార్డు సభ్యులు తవిటి సైదులు, శారద నాగరాజు, ముధావత్ తనేష్, స్రవంతి, మర్రి లతీఫ్, గంట రవి, పంచాయితీ కార్యదర్శి సుధాకర్ పాల్గొన్నారు.

## సర్పంచ్‌కు సన్మానం



**ప్రజాపక్షం/అర్వపల్లి** : కాసర్లపహాడ్ హనుమాన్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో అర్వపల్లి సర్పంచ్ చిల్లంచర్ల విద్యాసాగర్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షుడు బొల్లం వీరమల్లు, ఉపాధ్యక్షుడు దండుగుల వెంకన్న, సిరికొండ సత్యనారాయణ, దండుగల ఎల్లయ్య, కొలిశెట్టి యాదగిరి, పిట్టల అంజయ్య, మచ్చ సైదులు పాల్గొన్నారు.

## వార్డుల్లో సమస్యల పరిశీలన

**ప్రజాపక్షం/ రామన్నపేట:** మండలంలోని బోగారం గ్రామంలో నూతన సర్పంచ్ సాయికుమార్‌గౌడ్ గ్రామంలోని పలు వార్డుల్లో సమస్యలను పరిశీలించారు. కొన్ని సమస్యలను తక్షణమే పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్నా వార్డు మెంబర్లకు, తన దృష్టికి తీసుకురావాలని, సమస్య పరిష్కార దిశగా ఆలోచన చేసి గ్రామాభివృద్ధికి పాల్పడుతానని, అందరి సహకారం ఎల్లవేళలా ఉండాలని అన్నారు. ఆయన వెంట ఉపసర్పంచ్ బైకాని ఉమామహేష్, వార్డు మెంబర్లు గోగు ప్రమీల రమేష్, కునుకు మల్లేశం, మేడి ఆంజనేయులు, దేవి, మానస, సురేష్, గ్రామస్థులు ఉన్నారు.

## ఎస్సై రామ్మూర్తికి సన్మానం

**ప్రజాపక్షం/చింతపల్లి** : మండల పరిధిలోని ఘడియ గౌరారం గ్రామ ఉపసర్పంచ్ ఆదిరాల కృష్ణయ్య బుధవారం స్థానిక ఎస్సై రామ్మూర్తిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికలలో ఘడియ గౌరారం గ్రామంలో ఆదిరాల కృష్ణయ్య వార్డు సభ్యులుగా పోటీచేసి ఘనవిజయం సాధించారు. తదనంతరం ఉపసర్పంచ్‌గా ఎన్నికై పదవి బాధ్యతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల కోశాధికారి గుణమోని కొండల్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు తంగేళ్ల శివకృష్ణ, వార్డు సభ్యులు నడింపల్లి శ్రీహరి, అర్జున్ యాదవ్, కంబాలపల్లి రాజు, తంగెళ్ల విష్ణు పాల్గొన్నారు.



# ఎరువుల కొనుగోలుకు యాప్ ఉపయోగించండి



**ప్రజాపక్షం/చిట్యాల:** రైతులు తమకు కావల్సిన ఎరువులను కొనుగోలు చేయడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం యాప్‌ను అందుబాటులోకి తెచ్చిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ అడిషనల్ డైరక్టర్ నర్సింహ్మారావు అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటి కేంద్రంలోని మన గ్రోమోర్, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాన్ని ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు కలిసిన రైతులతో మాట్లాడుతూ రైతుల సౌలభ్యం కోసం ప్రభుత్వం యాప్‌ను తీసుకురావడం జరిగిందన్నారు. ఈ యాప్ ద్వారా తమకు కావల్సిన ఎరువును, తమకు సమీపంలో డీలర్ దగ్గరి నుండి కొనుగోలు చేసుకునేందుకు వీలౌతుందని, దీని ద్వారా సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. అలాగే ఏ డీలర్ దగ్గర ఎంత ఎరువు అందుబాటులో ఉందనే విషయం కూడా తెలిస్తుందన్నారు. యాప్ పనితీరును ఆయన ఈ సందర్భంగా పరిశీలించారు. ఆయన వెంట జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్, నకిరేకల్ వ్యవసాయ సహాయ సంచాలకులు జానీ మియా, మండల వ్యవసాయాధికారి పగిడిమర్రి గిరిబాబు, ఏఈఓ వాసుదేవ్ తదతరులు పాల్గొన్నారు.

# మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం** : నూతన సంవత్సరం సందర్భంగా మద్యం సేవించి వాహనాలు నడిపితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై జగన్ హెచ్చరించారు. ప్రధానంగా పట్టణ ప్రవేశ మార్గాలు జన సంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడితే భారీ జరిమానాలు విధించడంతోపాటు డ్రైవింగ్ లైసెన్స్ రద్దు, వాహనం సీజ్ చేయడం లాంటి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజల ప్రాణభద్రత ప్రధాన లక్ష్యమని ఒక్క క్షణం నిర్లక్ష్యం ప్రాణ నష్టానికి దారితీస్తుందని అన్నారు. మద్యం సేవించిన వారు వాహనాలు నడపకుండా ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకోవాలని, చట్టానికి సహకరించాలని కోరారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ కృష్ణవేణిలో స్వపరిపాలన వేడుకలు



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** మండల కేంద్రంలోని శ్రీ కృష్ణవేణి పాఠశాలలో బుధవారం స్వపరిపాలన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ కట్ట వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులలో నాయకత్వాన్ని, నైపుణ్యాన్ని వెలికితీసేందుకు పాఠశాల ఎల్లప్పుడు కృషి చేస్తుందని అన్నారు. విద్యార్థులు వివిధ వేషాధారణలో వచ్చి అందరిని అలరించారు. ఒక్క రోజు సిఎంగా సురేష్, డిప్యూటి సిఎంగా అనిరుద్, విద్యాశాఖ మంత్రిగా లోకేష్, కలెక్టర్ సాయి భవాని, ఆర్‌జెడిగా ఉమేష్, డిఈవో మోక్షిత, ఎంఈవోగా గీతిక, హెచ్ఎంలుగా చైతన్యలు వ్యవహరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ దామోదర్‌రెడ్డి, ఉపాధ్యాయులు బొమ్మ శ్రీను, పల్లా వెంకట్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా జీవితంలో స్థిరపడాలి...

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** మహిళలు ప్రభుత్వం అందించే స్వయం ఉపాధి పథకాలతో, పావలా వడ్డీ, వడ్డీ లేని రుణాలతో స్వయంగా వ్యాపారాలను ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా స్థిరపడాలని మండల పరిధిలోని గుమ్మడవల్లి నూతన సర్పంచ్ ఆదిరాల సుమలత రమేష్‌కుమార్‌లు అన్నారు. బుధవారం గుమ్మడవల్లి గ్రామంలో మహిళామణులకు సర్పంచ్ అధికారులతో కలిసి ఇందిరా మహిళా శక్తి చీరలను పంపిణి చేశారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్‌లు బచ్చునబోయిన శ్రీనివాస్‌యాదవ్, వార్డు సభ్యులు మారం వెంకట్‌రెడ్డి, పెద్దిరాజు, బొడ్డుపల్లి నిరంజన్, చందన, రామాచారి, మహిళా సంఘం అధ్యక్షురాలు వర్కాల సరిత, బొడ్డుపల్లి కళమ్మ, మహిళలు తదితరులు పాల్గొన్నారు.





## ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/వలిగొండ** : వలిగొండ మండలంలోని పులిగిల్ల గ్రామానికి చెందిన గొడుగు వెంకటేశ్వర్లు ఆనారోగ్యంతో మరణించారు. చాలా నిరుపేద కుటుంబం కనీసం ఉండడానికి ఇల్లు కూడా లేదు అని సమాచారం తెలిసిన వెంటనే ఏజెఆర్ ఫౌండేషన్ అధినేత ఎలిమినేటి జంగారెడ్డి సహకారంతో రూ.5000 ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు బుగ్గ మల్లేశ్, గ్రామ నాయకులు, మాజీ ఎంపీటీసీ బండారు ఎల్లయ్య, కొలను రాంరెడ్డి, ఆలేటి కొండల్, మన్నెం వెంకట్ రెడ్డి, వడ్డేమాన్ శ్రీనివాస్, దొడ్డి మురళి, ఏజేఆర్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## గ్రామ సమస్యలను పరిష్కరించాలి

**ప్రజాపక్షం/చిట్యాల:** నూతనంగా ఎన్నికైన గ్రామ పంచాయతి పాలక వర్గం గ్రామంలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పిట్టంపల్లి గ్రామస్థులు కోరారు. గ్రామ సర్పంచ్ అందె అండాలురాములు, ఉపసర్పంచ్ నారగోని నాగరాజులతో పాటు వార్డు సభ్యులు బుధవారం గ్రామంలో ఉన్న సమస్యలను తెలుసు కోవడానికి ప్రజాక్షేత్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు పలు సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చారు. గ్రామంలో ప్రధానంగా మురికి కాలువలు, విద్యుత్ దీపాలు, శిథిలావస్థలో ఉన్న రోడ్లు తదితర సమస్యలను వారి దృష్టికి తీసుకు వచ్చారు. సాధ్యమైనంత త్వరలో సమస్యలను పరిష్కరించాలని ప్రజలు వారిని కోరారు. శాసనసభ్యులు, మండల అధికారుల దృష్టికి గ్రామ సమస్యలను తీసుకువెళ్ళి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని సర్పంచ్, ఉప సర్పంచ్‌లు ప్రజలకు హామి ఇచ్చారు.

## ఉచితంగా పుస్తకాల పంపిణీ



**ప్రజాపక్షం/చిట్యాల:** తెలంగాణ రాష్ట్ర విజయ డైరీ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని నల్లగొండ జిల్లా వట్టిమర్తి గ్రామ యూత్ కాంగ్రెస్ నాయకులు విద్యార్థులకు ఉపయోగపడే పాఠ్యపుస్తకాలను బుధవారం అందజేశారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థులకు గురుకుల పాఠశాలల్లో ప్రవేశాల కోసం వ్యాసే ప్రవేశ పరీక్షలకు దిశా నిర్ధేశం చేసే పుస్తకాలను యువకులు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మేడి శ్రీలత పాల్గొని మాట్లాడుతూ విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని యువకులు భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపట్లాని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు దామనూరి పృథ్వీ, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు నర్రా వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు మేడి శ్రీను, దామనూరి కృష్ణయ్య, ఐతరాజు సత్యంబాబు, బూరుగు రవి, బెల్లపు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కొత్త సంవత్సరంలో విజయాలు సాధించాలి

**ప్రజాపక్షం/చిట్యాల:** 2026 సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ సంబురాలు జరుపుకుంటున్న విద్యార్థులు ఈ సంవత్సరంలో విజయాలు సాధించాలని నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటి కేంద్రంలో ఆక్స్‌ఫర్డ్ పాఠశాల వ్యవహర్త పెద్ది నరేందర్ అన్నారు. బుధవారం రోజున పాఠశాలలో ముందస్తు ఆంగ్ల నూతన సంవత్సర సంబురాలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు మార్చిలో జరిగే వార్షిక పరీక్షలలో ఉత్తమమైన మార్కులు పొంది పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని అన్నారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు కేక్‌లను కట్ చేశారు. పాఠశాల సిబ్బంది పెద్ది పద్మ, నమ్ముల ఆనందకుమార్, షేక్ షమీమున్నీసా బేగం, స్వాతి, ఎస్ జ్యోతి, రమాదేవి, ధనలక్ష్మి ,జుబేదా, మాధవి, మౌనిక, కీర్తి, సంపూర్ణ, స్వప్న పాల్గొన్నారు.





## మత్స్యాద్రి పరిసర ప్రజల చిరకాల కోరిక నెరవేర్చిన అనంతరెడ్డి

**ప్రజాపక్షం/వలిగొండ** : యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో వెలిసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ మత్స్యగిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి నిత్యం వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకు నేందుకు తెలంగాణ రాష్ట్రం నలుమూలల నుండి వస్తూ ఉంటారు. స్థానిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వాకిటి అనంతరెడ్డి ఇచ్చిన మాట ప్రకారం మత్స్యాద్రి ఘాట్ రోడ్డును తన సొంత నిధులతో పూర్తి చేయించి భక్తులకు అందుబాటులో తెచ్చిన ఘనత అనంతరెడ్డికే దక్కుతుందని ఈ సందర్భంగా ప్రజలు అనంతరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వాకిటి అనంతరెడ్డి అభిమానులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సంతాప సభలో అనంతరెడ్డి



**ప్రజాపక్షం/వలిగొండ** : వలిగొండ మండలం వేములకొండ గ్రామం మచ్చాద్రి ఫంక్షన్‌హాల్‌లో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సుదర్శన్ సంతాప సభలో మాట్లాడుతూ సిపిఐ పార్టీకి ఈ ప్రాంత ప్రజలకు ఎనలేని సేవ చేశారని పార్టీలో క్రియాశీలకంగా తిరిగి పార్టీ బలోపేతానికి పేద ప్రజానీకానికి అందుబాటులో ఉండి సేవ చేశారని కొనియాడారు. సుదర్శన్ లేని లోటు చాలా బాధాకరమని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని అన్నారు.

## పీడీ యాక్ట్ నమోదు చేయాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ**: భ్రూణ హత్యలకు పాల్పడుతున్న ఆసుపత్రులను గుర్తించి వారి పీడీ యాక్ట్ కేసులను నమోదు చేసి వాటి గుర్తింపు రద్దు చేయాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ బుధవారం అన్నారు. పట్టణంలోని షాబునగర్‌లో ఆరు నెలల ఆడ గర్భస్థ శిశువును తల్లి గర్భంలోనే హత్య చేసిన వారిని గుర్తించాలని, నెలలు నిండక ముందే లింగ నిర్ధారణ పరీక్షలు చేసే ఆసుపత్రులను, స్కానింగ్ సెంటర్లను గుర్తించి ఆసుపత్రులను రద్దుచేసి సదరు వైద్యులపై పీడీ యాక్ట్ కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇలాంటి పరీక్షలు నిర్వహించిన, ప్రోత్సహించిన, సహకరించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన జిల్లా వైద్యశాఖ అధికారులను కోరారు.

## ఆర్థిక సహాయం అందజేత

**ప్రజాపక్షం/అర్వపల్లి** : మండల కేంద్రానికి చెందిన కోమారి సురేష్ తండ్రి అయన కోమారి ఎల్లయ్య ఇటీవల మృతి చెందాడు. కుమారి సురేష్ మిత్రులు 2007 బ్యాంచ్ పదో తరగతికి చెందిన విద్యార్థులు కలిసి తమ మిత్రునికి రూ.20వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఆర్థిక సహాయం అందజేసిన వారిలో దావుల నాగరాజు, ఎస్‌కె జహంగీర్, కదారి శివ, కదారి సైదులు, పుప్పాల సోమశేఖర్, సిరికొండ అశోక్, రాచూరు ఉపేందర్ ఉన్నారు.



# 2026 నూతన సంవత్సరం అంతా శుభమే

### రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : 2026 నూతన సంవత్సరంలో ప్రజలకు అంతా శుభమే జరగాలని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. నూతన సంవత్సరంలోకి అడుగిడుతున్న సందర్భంగా ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షల మేరకు పనిచేస్తూ ముందుకు సాగుతుందని చెప్పారు. రెండేండ్ల కాంగ్రెస్ పాలనలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చడం జరిగిందన్నారు. సిఎం రేవంత్ రెడ్డి తన పాలన మార్క్‌ను పొందుతున్నారని తెలిపారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సద్దల చెరువు సమీపంలో 2026 సంవత్సరంలో రూ.20 కోట్ల నిధులతో ఇంటర్నేషనల్ పార్క్ నిర్మాణం చేపట్టబోతున్నట్లు వివరించారు. అండర్ డ్రైనేజీ నిర్మాణ పూర్తికి అధిక నిధులు మంజూరు చేసేందుకు కృషి చేస్తానన్నారు. అలాగే ఉండ్రుగొండ శ్రీలక్ష్మి నృసింహ స్వామి అభివృద్ధి కోసం టూరిజం శాఖ నుండి అదనంగా మరో రూ.2కోట్లను మంజూరి చేసినట్లు తెలిపారు. నూతన సంవత్సరంలో సూర్యాపేట నియోజక వర్గ వ్యాప్తంగా అభివృద్ధి పనులు పరుగులు పెడుతాయని చెప్పారు. ప్రజలు అన్ని రకాలుగా నూతన సంవత్సరంలో కలిసి రావాలని ఆకాంక్షించారు.

## ఎస్ఐ సురేష్‌రెడ్డిని తక్షణమే సస్పెండ్ చేయాలి



**ప్రజాపక్షం/కోదాడ:** కర్ల రాజేష్ మృతికి ప్రధాన కారణమైన చిలుకూరు ఎస్ఐ సురేష్‌రెడ్డిని తక్షణమే సస్పెండ్ చేయాలని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కోదాడలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దీక్షకు ఆయన సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల వివక్షతతోనే అసలు దోషిని విడిచిపెట్టి కోదాడ రూరల్ సిఐ ప్రతాపలింగంను సస్పెండ్ చేయడం సహించరానిదన్నారు. కాంగ్రెస్ నేతలు సైతం ఈ అంశంపై నోరు మెదపడంలేదని ఇందుకు కారణం ఏమిటో అర్థం చేసుకోవాలన్నారు. బలమైన సామాజిక వర్గం కనుకనే చిలుకూరు ఎస్ఐని సస్పెండ్ చేయడంలేదని ఆయన అరోపించారు. నియోజకవర్గానికి బాధ్యత వహించే నేతలు సైతం ఇలా వ్యవహరించడం ఏమిటని ప్రశ్నించారు. న్యాయం జరిగే వరకు లలితమ్మ కుటుంబానికి ఎమ్మార్పీస్, దళిత సంఘాలకు తన మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

## బండకొత్తపల్లి ఎంపిపిఎస్‌లో ఫుడ్ ఫెస్టివల్

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం బండకొత్తపల్లి గ్రామంలోని ఎంపిపిఎస్ పాఠశాలలో బుధవారం ఫుడ్ ఫెస్టివల్‌ను నిర్వహించారు. ఈకార్యక్రమానికి గ్రామ సర్పంచ్ గద్వాల ఉపేందర్ హాజరై మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అని సహజమైన, పోషకాలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఎక్కువ కాలం జీవించగలమని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరు పోషకాహారంతో కూడాని ఆహారాన్ని తీసుకోవాలని ఆయన సూచించారు. పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్స్‌ను నిర్వహించడం ద్వారా విద్యార్థులకు ఆహారం గురించి అవగాహన కల్పించడం జరుగుతుందని ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎర్ర సుధాకర్, ఎస్ఎంసి చైర్మన్ రేణుక, ఉప సర్పంచ్ యాదగిరి, రవి, రాజశేఖర్, నర్సయ్య, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం వెల్మజాల గ్రామ పంచాయతీ కార్యాలయం బుధవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరా మహిళా శక్తి చీరలను సంఘ బంధం అధ్యక్షురాలు బొడ్డుపల్లి రేణుక ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ కురిమిళ్ళ కవిత, ఉప సర్పంచ్ కచ్చిగళ్ళ మహేందర్ చేతుల మీదుగా మహిళలకు చీరలను పంపిణి చేశారు. ఈకార్యక్రమంలో వార్డుసభ్యులు కిషన్, బాలరాజు, ఇందిరమ్మ కమిటి సభ్యులు వినోద్, గ్రామ యువకులు అశోక్, మధు, నవీన్, మల్లాచారి, సామాజిక వేత్త పురుషోత్తం, మాధవి, వివోఏ జయమ్మ, పూజ, లక్ష్మీ, యాదమ్మ, సత్తలక్ష్మీ, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.



## పోలింగ్ కేంద్రాల పరిశీలన

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ**: మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిన దృష్ట్యా బుధవారం మున్సిపల్ కమీషనర్ జి.శ్రీనివాస్ మున్సిపల్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. మున్సిపాలిటీ పరిధిలో సుమారు 87431 మంది ఓటర్లు ఉన్నారు. వీరికి మహిళలు, పురుషులకు కలిపి 86 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వాటిలో కొన్నింటిని కమీషనర్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీటి, విద్యుత్, ఫర్నీచర్ సౌకర్యాలు ఉన్నాయా లేదా ఎన్నికల అధికారులు, సిబ్బందికి కనీస సౌకర్యాలు ఉన్నాయా లేదా అని పరిశీలించారు. ఆయన వెంట డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ వెంకన్న, టీపీఎస్ అంజయ్య, టీపీబీవో వినోద్ ఉన్నారు.





## గణితశాస్త్ర పోటీల్లో మేఘన ప్రతిభ

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ**: తెలంగాణ రాష్ట్ర గణిత శాస్త్ర ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పాటవ పరీక్షల్లో పట్టణంలోని బకల్‌వాడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కె.మేఘన ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అలుగుబెల్లి కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమ ప్రతిభను రాబోయేకాలంలో పోటీ ప్రపంచంలో నిలవాలంటే ఇలాంటి పరీక్షలు ఉపయోగపడుతాయని అన్నారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థిని మేఘనను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, గిరీజ, కర్నాటి శ్రీనివాస్, పంగ సైదులు, చంద్రయ్య, దాశివ, రహీం, సైదానాయక్, నెహ్రూ, సునీత, మాధవి, ఉదయ్‌కుమారి తదితరులు పాల్గొన్నారు.

## స్వపరిపాలన దినోత్సవం



**ప్రజాపక్షం/నకిరేకల్** : పట్టణంలోని ఏవీఎం హైస్కూల్‌లో బుధవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బెల్లి యాదయ్య విచ్చేసి మాట్లాడారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు,ప్రజాస్వామ్య విలువలు పెంపొందించడంతో పాటు బాధ్యతాయుతమైన భావనను అలవర్చాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవీఎం విద్యాసంస్థల అధినేత, కరస్పాండెంట్ కందాల పాపిరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కందాల స్వప్నారెడ్డి,శ్రీకాంత్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి,జితేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఉపాధ్యాయులు,విద్యార్థులు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## హెల్త్ సెంటర్ బిల్డింగ్ పనులు ప్రారంభం



**ప్రజాపక్షం/నకిరేకల్ :** నకిరేకల్ మండలం మంగళపల్లి గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం కృషితో మాజీ యంపీపి బచ్చుపల్లి శ్రీదేవి గంగాధర్ రావు చొరవతో మంజూరైన హెల్త్ సెంటర్ బిల్డింగ్ పనులను గ్రామ సర్పంచ్ గాదరి జయమ్మ రాఘవులు ప్రారంభించారు. కార్యక్రమంలో పిఆర్ ఏఈ సంపత్ కూమార్,పాల సంఘం చైర్మెన్ చింతల ముత్తయ్య,ఉపసర్పంచ్ బచ్చుపల్లి రామాలింగారావు, మార్కెట్ డైరెక్టర్ బొల్లేద్దు లక్ష్మయ్య,వార్డు మెంబర్లు కొప్పుల వెంకన్న,కందికంటి సైదమ్మ వెంకన్న,చింతల వీరయ్య,బొల్లేద్దు తేజ నాగరాజు, రామాదేవి సతీష్, పాల్గొన్నారు.

## ఆనందరావు సేవలు మరువలేనివి



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** మండల పరిధిలోని రాముని గుండ్ల తండా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆనందరావు విద్యార్థులకు చేసిన సేవలు మరువలేనివని కేశ్య తండా సర్పంచ్ రాజునాయక్,రామునిగుండ్ల తండా సర్పంచ్ సంగీత సురేష్‌లు అన్నారు. గిరిజన ప్రాంత విద్యార్థులకు ఓర్పుతో విద్య నేర్పి, వారి అభివృద్ధికి ఆనందరావు చాలా కృషి చేశారని వారు అన్నారు. ఆనందరావు పదవి విరమణకు స్థానిక ప్రజా ప్రతినిధులు తోటి ఉపాధ్యాయులు హాజరై ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈకార్యక్రమంలో రామునిగుండ్లతండా ఉప సర్పంచ్ రమేష్, వార్డుసభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## డి-40 కాలువ పూడిక తీత

**ప్రజాపక్షం/మాడుగులపల్లి:** సర్పంచ్ ఎలక్షన్లలో సీత్యా తండా గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీ ప్రకారం ఆ గ్రామ సర్పంచ్ బుధవారం డి40 కాల్వ పూడి పోవడంతో సుమారు లక్ష రూపాయల తన సొంత నిధులతో పూడికతీత తీయించడం జరిగిందని సర్పంచ్ రాయారపు ఉమారాణి వెంకన్న తిలవేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ ప్రజలకు గ్రామంలో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు కావాలన్నా కూడా ముందు ఉండి గ్రామాన్ని అభివృద్ధి పదంలో నడిపిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వార్డ్ మెంబర్లు,రైతులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలి



**ప్రజాపక్షం/వేములపల్లి;** మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ ఎస్సి కాలనీలలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు పుట్టల మధు అన్నారు బుధవారం ఆయన పోలీస్ స్టేషన్లో హౌస్ ఆఫీసర్ డి వెంకటేశ్వర్లు మర్యాదపూర్వకంగా కలిసి అంబేద్కర్ చిత్రపటాన్ని బహుకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని పరిసర ప్రాంతాల్లో ప్రజలు భయభ్రాంతులకు గురికాకుండా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి స్కూల్లో కాలేజీ ప్రాంతాలలో పోలీస్ సిబ్బందిని అక్కడక్కడ గస్తీ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు పందు,వంశీ,కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన ప్రణాళికతో ముందుకెళ్లాలి

**ప్రజాపక్షం/నకిరేకల్ :** విందులు,వినోదాలు,కేరింతలతో సరిపెట్టుకోకుండా విద్యార్థులు నూతన సంవత్సరానికి స్పష్టమైన లక్ష్యాలు నిర్దేశించుకొని భవిష్యత్ ప్రణాళికతో విద్యను అభ్యసించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బెల్లి యాదయ్య పేర్కొన్నారు.బుధవారం స్థానిక కళాశాలలో ఫ్యూచర్ ప్లాన్ 2026 కార్యక్రమం సందర్భంగా ఆయన మాట్లాడారు. నేటి యువత నైపుణ్య లేమితో కొట్టుమిట్టాడుతుందన్నారు. విద్యా సామర్థ్యాలలో ఏ అంశంలో వెనుకబడినారో గుర్తెరిగి తగిన శిక్షణ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగు,అధ్యాపకులు డి.శివశంకర్,మధుసూదన్ రెడ్డి,శంకర్,రవీందర్,ఉపేందర్,నర్సింహాచారి,సుభాషిణి పాల్గొన్నారు.



# ఉచిత మెగా వైద్య శిబిరం విజయవంతం

**ప్రజాపక్షం/మాడ్గులపల్లి :** మండలంలోని ధర్మపురం గ్రామంలో కీర్తిశేషులు కొండేటి ముత్తమ్మ జ్ఞాపకార్థం నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరం విజయంతంగా కొనసాగింది.మదర్ థేరిసా ఎడ్యుకేషన్ సొసైటీ,దీప్తి గ్రూప్ ఆఫ్ నర్సింగ్ ఇనిస్టిట్యూషన్స్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నల్లగొండ పార్లమెంట్ సభ్యులు కుందూరు రఘువీర్ రెడ్డి,జిల్లా సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ శరత్ చంద్ర పవార్‌లు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనునిత్యం పేద ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి బాగోగులను చూసుకోవడమే కాకుండా వారి ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని ఇలాంటి మెగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం చాలా గర్వించదగ్గ విషయమని అన్నారు. రోగులకు అవసరమైన మందులు కళ్లద్దాలు తదితర వైద్య సామాగ్రిని ఉచితంగా అందజేశారు. అనంతరం వైద్య శిబిరంలో పాల్గొన్న డాక్టర్లను,వైద్య సిబ్బందిని ఈ సందర్భంగా ఘనంగా శాలువా కప్పి సన్మానించారు.ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షుడు పున్న కైలాస్ నేత,డాక్టర్లు కొండేటి సౌమ్యశ్రీ ప్రమోద్ కుమార్,డా:కే. దీప్తి,మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం,స్థానిక సర్పంచ్ కొత్త దశరథ,సైదిరెడ్డి పాల్గొన్నారు.



# ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు గోపగోని మాధవి జన్మదిన వేడుకలను బుధవారం జిల్లా కేంద్రంలో మహిళా కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి యగ్గిడి సుజాత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.అనంతరం కేక్ కట్ చేసి మాధవికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా యగ్గిడి సుజాత మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల సంక్షేమం తో పాటు మహిళాభివృద్ధి కోసం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఎంతో కృషి చేస్తున్నారన్నారు. మహిళలను అన్ని రంగాలలో రాణించే విధంగా మహిళా కాంగ్రెస్ తరపున కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి పోలేపల్లి రుద్ర, జిల్లా నాయకులు చింతపల్లి సదాలక్ష్మి, మండల అధ్యక్షురాలు స్వరూప రెడ్డి,జిల్లా కార్యవర్గ సభ్యులు జక్కల లలిత, పట్టణ ప్రధాన కార్యదర్శి మహాలక్ష్మి, వెంకటమ్మ పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కృష్ణ అండ

**ప్రజాపక్షం/మునుగోడు:** మండలంలోని పలివెల గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో చదివి ప్రతి విద్యార్థికి అండగా ఉంటానని ఆ గ్రామ వార్డు సభ్యుడు ఆనగంటి కృష్ణ అన్నారు.బుధవారం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పలకలు పెన్నులతో పాటు పలు ఉపయోగపడే వస్తువులను పంపిణీ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు వ్యవస్థను అరికట్టడంతో పాటు ప్రభుత్వ పాఠశాలలో బలోపేతానికి తన వంతుగా కృషి చేస్తానని అన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులందరూ ప్రభుత్వ ఉద్యోగాలు రావాలంటే ప్రభుత్వ పాఠశాలలోనే చదివించాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చెరుకు సునీత సైదులు,వార్డు సభ్యులు కొండూరి మాధవి,బత్తుల శేఖర్,గోసు కొండ మల్లేష్,ప్రధానోపాధ్యాయులు ఆదే సత్యనారాయణ ఉయ్యాల సోమయ్య, నాయకులు దాడి జితేందర్ రెడ్డి,సొల్లేటి నరసింహ చారి,రాజేందర్ రెడ్డి. రాము,శ్రీనివాసు,మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



# పౌరహక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలి




**ప్రజాపక్షం/వేములపల్లి:** పౌర హక్కుల దినోత్సవ సందర్భంగా( సివిల్ రైట్స్) మండల కేంద్రంలో బుధవారం రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో స్థానిక గ్రామ ప్రజలకు పౌర హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈకార్యక్రమంలో స్థానిక గ్రామ సర్పంచ్ పుట్టల సందీప్ కుమార్, ఎస్సై డి.వెంకటేశ్వర్లు, ఆర్ఐ స్పందన,జీపీవో ప్రణిత రెడ్డి లతో పాల్గొన్నారు.ఆయన మాట్లాడుతూ దేశంలో పుట్టిన ప్రతి ఒక్క పౌరుడికి దేశ పౌర హక్కులపై సరి అయిన అవగాహన కలిగి ఉండాలని అన్నారు. పౌర హక్కులపై అవగాహన కలిగి ఉంటే ప్రభుత్వ కార్యాలయాలలో తన హక్కుల పై ప్రశ్నించే తత్వం ఏర్పడుతుందని అప్పుడే ప్రతి ఒక్క వ్యక్తికి న్యాయం జరుగుతుందని అన్నారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ప్రభుత్వ అధికారులకు తమ సమస్యలను పోలీస్ స్టేషన్, తహసిల్దార్ కార్యాలయానికి సామాన్య వ్యక్తి వచ్చినప్పుడు వారి తరుపున వాస్తవమైన ఆధారాలు ఉన్నప్పుడు వారి తరఫున నిలబడాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఏబీఆర్ యూత్ అధ్యక్షుడు పుట్టల మధు,బొంగర్ల వినోద్, పుట్టల శ్రీనివాస్ కళ్ళు, ఎస్సి సెల్ మండల అధ్యక్షుడు పుట్టల వెంకన్న కొము,సంజయ్,పుట్టల శ్రీనివాస్,కొంటెపాక వంశీ,పగడాల చందు, చెడిపల్లి బాలకృష్ణ, పుట్టల శంకర్ స్థానిక యువత,పెద్ద మనుషులు మహిళలు పాల్గొన్నారు.



## గ్రామ అభివృద్ధికి పాటుపడాలి

**ప్రజాపక్షం/మునుగోడు:** గ్రామంలో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకుంటూ గ్రామ అభివృద్ధికి పాటుపడాలని ఎమ్మెల్సీలు నెల్లికంటి సత్యం,శంకర్ నాయక్‌లు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో మునుగోడు సర్పంచిగా గెలుపొందిన పాలకూరి రమాదేవి నరసింహను ఎమ్మెల్సీలు శాలువాతో సన్మానించి అభినందించారు.ఈ కార్యక్రమంలో మాజీ డిసిసిబి ఛైర్మెన్ కుంభం శ్రీనివాసరెడ్డి,నారబోయిన రవి,సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తీర్పారి వెంకటేశ్వర్లు, జిల్లా సమితి సభ్యులుసురిగి చలపతి,మండల కార్యదర్శి చాపల శ్రీను,ఈదులకంటి కైలాస్,ముత్యపుతుల శ్రీనివాసు, గోపగోని ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఐకెపి విఓఎలు సన్మానం




**ప్రజాపక్షం/తిరుమలగిరి సాగర్ :** మండల పరిధిలోని నెల్లికల్ గ్రామ సర్పంచ్ గా గెలుపొందిన వట్టాల శ్రీను ను మండల సమైక్య ఐకెపి వివోఏ ల యూనియన్ మాజీ అధ్యక్షులు బాలకృష్ణ పట్నాయక్ ఆధ్వర్యంలో బుధవారం కేక్ కట్ చేసి శాలువతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐకెపిలో వివోఏ గా మాలో ఒకరిగా పనిచేస్తూ స్థానిక ఎన్నికల్లో గెలుపొంది నూతనంగా బాధ్యతలు చేపట్టినందున వారికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో డిపిఎం వీరయ్య,ఎమ్మెస్ ఏపిఎం రాజేశ్వరి,వివోఎ యూనియన్ అధ్యక్షులు అజిత,కల్లమ్మ,సంగీత,ధనలక్ష్మి,వనిత,లక్ష్మి మరియమ్మ,కవిత సరోజ,మౌనిక ఈశ్వరమ్మ ఎమ్మెస్ అకౌంటెంట్ పార్వతి,లాలు నాయక్,రమేష్ పాల్గొన్నారు.

## లింగయ్య కుటుంబాన్ని ఆదుకోవాలి




**ప్రజా పక్షం/హాలియా:** గత నాలుగు రోజుల క్రితం పాలెం గ్రామానికి చెందిన కారణం లింగయ్య ఆర్థిక ఇబ్బందులతో మృతి చెందాడని ఆ కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని కల్లుగీత కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు కొండ వెంకన్న డిమాండ్ చేశారు. బుధవారం కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు, మండల అధ్యక్షుడు నర్సింగ్ సైదులు కలిసి మృతి చెందిన లింగయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. నిత్యం ఎన్నో ఇబ్బందులు పడి కష్టపడి కుటుంబాన్ని పోషిస్తున్న లింగయ్య ఆర్థిక ఇబ్బందుల బాధలు భరించలేక మృతి చెందిన సంగతి అందరికీ తెలుసు అన్నారు. చిన్న వయసులోనే భర్తను కోల్పోయిన లింగయ్య భార్యకు, అతని కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచి ఆర్థిక సాయం అందించాలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట మండల ఉపాధ్యక్షుడు కాసాని సత్తయ్య,కాట్నం పరమేష్ తదితరులు ఉన్నారు.

## నర్సింహారెడ్డి జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/చందంపేట;** నల్గొండ జిల్లా చందంపేట మండలం చిత్రియాల గ్రామానికి చెందిన టిపిసిసి సభ్యులు జాలె నర్సింహారెడ్డి జన్మదినం సందర్భంగా బుధవారం కేక్‌కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండే నర్సింహారెడ్డి అభిమా నులు పెద్ద ఎత్తున పూలమాలలు, శాలువాలతో సన్మా నించి కేకులను కట్ చేయించిన శుభాకాంక్షలు తెలిపారు.



## విప్లవ యువ కేతనం యానాల వీరారెడ్డి

**ప్రజాపక్షం/నకిరేకల్** : ఉమ్మడి నల్లగొండ జిల్లా పిడిఎస్‌యూ పూర్వ అధ్యక్షులు యానాల వీరారెడ్డి 35వ వర్ధంతి సందర్భంగా పిడిఎస్‌యు ఆధ్వర్యంలో వర్ధంతి సభ జరిగింది.ఈ సందర్భంగా ఆసంఘం పూర్వ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇందూరు సాగర్,పూర్వ సహాయ కార్యదర్శి అంబటి చిరంజీవి మాట్లాడారు వీరారెడ్డి నవ యవనప్రాయం లోనే విప్లవోద్యమంలోకి అడుగుపెట్టి సమాజ మార్పును కోరుకున్నాడన్నారు. జిల్లా కమిటీ అధ్యక్షులు పోలె పవన్ అధ్యక్షత ఈ సభలో నాయకులు రాజేష్, మల్లిక్, స్వామి, స్వప్న,అనిత,మహేశ్వరీ,రేణుక పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం



**ప్రజాపక్షం/ఆత్మకూరు(యం)** : మండల కేంద్రం రాంనగర్ కాలనీలో నివాసం ఉంటున్న కందడి అండమ్మ గత వారం మృతి చెందగా వారి కుటుంబానికి గ్రామ సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్ రూ.5000, 10వ వార్డు సభ్యులు గట్టు విశాల్ 50 కేజీల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షులు కోరే వెంకన్న, మాజీ ఎంపీటీసీ యాస కవిత ఇంద్రా రెడ్డి, మాజీ మార్కెట్ డైరెక్టర్ గడ్డం దశరథ గౌడ్ పాల్గొన్నారు.

## కొత్త సంవత్సర శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** నియోజకవర్గ ప్రజలకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, ఎన్‌బీఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ నల్లమోతు సిద్దార్థ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన ఆశలు, ఆశయాలతో ప్రతి ఒక్కరు కొత్త సంవత్సరంలోకి అడుగు పెట్టాలని ఆయన ఆకాంక్షించారు.

## మాజీ సిఎం కెసిఆర్‌ను కలిసిన శంకర్ యాదవ్

**ప్రజాపక్షం/నకిరేకల్** : బిఆర్ఎస్ అధినేత,తెలంగాణ తొలిముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును బుధవారం నందినగర్‌లోని ఆయన నివాసంలో బిఆర్ఎస్‌వి రాష్ట్ర నాయకులు నోముల శంకర్ యాదవ్ మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.రాష్ట్రంలోని విద్యా వ్యవస్థలోని లోపాలు,విద్యార్థుల సమస్యలపై చర్చ జరిగిందని తెలిపారు.



# బోయపల్లి సురేందర్‌కు ఘన నివాళులు





**ప్రజాపక్షం/చండూరు:** నల్లగొండ జిల్లా చండూరు మండలం తుమ్మలపల్లి గ్రామానికి చెందిన బిగ్ టీవి నల్లగొండ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ బోయపల్లి రమేష్ తండ్రి తుమ్మలపల్లి మాజీ సర్పంచ్ బోయపల్లి సురేందర్ ఈ నెల 22న గుండె పోటుతో మరణించారు. బుధవారం అంగడిపేట పంక్షన్‌హాల్‌లో జరిగిన సురేందర్ దశదిన కార్యక్రమానికి మండలి చైర్మన్ గుత్త సుఖేందర్‌రెడ్డి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరై సురేందర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నల్లగొండ జిల్లా చండూరు మండలం తుమ్మపల్లి గ్రామానికి చెందిన బిగ్ టీవి నల్లగొండ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ బోయపల్లి రమేష్ తండ్రి మాజీ సర్పంచ్ సురేందర్ ఇటీవల గుండె పోటుతో మరణించారు. బుధవారం జరిగిన సురేందర్ దశదినకర్మ కార్యక్రమం మండల పరిధిలోని అంగడిపేట బిఆర్‌సి ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి సిపిఐ జిల్లా కార్యదర్శి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం హాజరై సురేందర్‌చిత్రపటానికి మూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర కల్లు గీత కార్పోరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ , సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నల్పరాజు రామలింగయ్య , తీర్పారి వెంకటేశ్వర్లు, సిపిఐ చండూరు మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్, మాజీ ఎంపిపి తోకల వెంకన్న, దోటి వెంకన్న, నరహరి, జర్నలిస్టులు వంగూరి నగేష్ , కర్నాటి వెంకటేశం , బోయపల్లి రాజేష్ ,రమేష్ , సురేందర్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# కథ మానవ జీవితానికి ప్రతిబింబం లాంటిది



**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా కథా సాహిత్యానికి పుట్టినిల్లు లాంటిదని, కవులు కథా ప్రక్రియపై ప్రత్యేకించి విమర్శ వ్యాసాలు రాయడం అభినందనీయమని తెలంగాణ భాషా సాంస్కృతిక శాక సంచాలకులు డాక్టర్ ఏనుగు నర్సింహ్మారెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామానికి చెందిన తెలుగు ఉపాధ్యాయులు, కవి, కథా రచయిత సాగర్ల సత్తయ్య రచించిన కథా దర్పణం, కథా విమర్శన వ్యాస సంపుటిని బుధవారం రోజున ఆయన ఆవిష్కరించిన సందర్భంగా మాట్లాడుతూ కథ మానవ జీవితానికి ప్రతిబింబం లాంటిదని, తెలుగు కథా సాహిత్యంలో నిలిచిపోవే కథలను రాసిన సత్తయ్య ఇటీవలనే బర్కతి అనే కథ సంపుటిని వెలువరించారని కొనియాడారు. అతను గొప్ప కథకుడే కాకుండా సాహిత్య విమర్శనా రంగంలో వివిధ ప్రక్రియల్లోని రచనలపై ఆయన చేస్తున్న సాహిత్య కృషి అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సృజన సాహితీ అధ్యక్షులు పెరుమాళ్ళ ఆనంద్, జిల్లాకు చెందిన కవులు తండు కృష్ణ కౌండిన్య, కుకుడాల గోవర్ధన్, పగిడిపాటి నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు.

# కొనసాగుతున్న వైకుంఠ ఏకాదశి వేడుకలు

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** ప్రసిద్ధ వైష్ణవ క్షేత్రం స్వర్ణగిరి వైకుంఠ ఏకాదశి వేడుకలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం స్వర్ణగిరి దివ్య క్షేత్రంలో గజ మహారాజుకు ఆలయ అర్చకులు, ఆలయ వ్యవస్థాపకుల సమక్షంలో శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గజరాజును మాడవీధుల్లో ఊరేగిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. దశావతారాలు, రామాయణ, భారత, భగవతాలలోని ఘట్టాలను సుందరంగా నెలకొల్పారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు మానేపల్లి రామారావు, మురళీకృష్ణ, గోపీకృష్ణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గజరాజు దర్శనం పొందారు.



## బియ్యం పంపిణీ

**ప్రజాపక్షం/తుర్కపల్లి** : మల్కాపురం గ్రామంలో భూపతి ఎల్లమ్మ ఇటీవల మృతిచెందగా బీర్ల ఫౌండేషన్ అధినేత బీర్ల అనిత సహకారంతో నిరుపేద కుటుంబానికి 50 కేజీల సన్న బియ్యం అందచేశారు. ఈ కార్యక్రమంలో మల్కాపూర్ గ్రామ సర్పంచ్ సొన్నాయిల రఘు, ఉప సర్పంచ్ ఆకుల బాలయ్య, వార్డు మెంబర్లు సొల్లేటి రాజు, తోడేటి సత్యనారాయణ పాల్గొన్నారు.



## జన్మదిన శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/తుర్కపల్లి** : తుర్కపల్లి మండలం గంధమల్ల గ్రామ సర్పంచ్ బొత్త రాములు మనుమడు చిన్నారి హర్షవర్ధన్ జన్మదిన వేడుకల్లో తుర్కపల్లి జర్నలిస్టులు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు పెండెం రవి, ఏశాల కృష్ణ, తునికి శ్రీనివాస్ గౌడ్, కళ్యాణ్ కొండల్ పాల్గొన్నారు.



## జిల్లాలో పిల్లల రక్షణపై బలమైన పురోగతి అశ్రీత

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : గ్రామాలలో అవగాహన కార్యక్రలలో గుర్తించిన పిల్లలకు, తల్లిదండ్రులకు బాల్యవివాహాలపై అవగాహన కల్పించటం ద్వారా ముందస్తుగా 182 మంది పిల్లలను బాల్యవివాహాలు జరగకుండా,పెళ్లి సంబంధాలు కుదుర్చుకున్న 15 బాల్యవివాహాలను 158 మంది పిల్లలను అందులో 26మంది బాలికలు,132 మంది అబ్బాయిలు అక్రమ రవాణా నుండి రక్షించడంలో అశ్రీత స్వచ్ఛంద సంస్థ సంస్థ డైరెక్టర్ నాగరాజా,జిల్లా కోఆర్డినేటర్ శోభారాణి అన్నారు.పిల్లల రక్షణ పరంగా 2025 ఒక మైలురాయి సంవత్సరం. జిల్లా పరిపాలనలు, పోలీసు అధికారులు,గ్రామ పంచాయతీలు మరియు ఉపాధ్యాయులతో కలిసి పని చేయడం వల్ల క్షేత్రస్థాయిలో స్పష్టమైన మార్పు వచ్చిందన్నారు. మన సమాజంలో పిల్లలు అత్యంత దుర్బలంగా ఉన్నారు.బాల్ వివాహ ముక్త్ భారత్ కింద ప్రభుత్వం 100 రోజుల ఇంటెన్సివ్ ప్రచారంలో జిల్లా యంత్రాంగంతో సన్నిహిత సమన్వయంతో పని చేస్తూ, వివాహాల సమయంలో సేవలను అందించే మరియు బాల్య వివాహాల నివారణలో కీలకమైన క్యాటరర్లు, టెంట్ సరఫరాదారులు,దర్జీలు మొదలైన వారిని ఈ ఎన్‌జిఓలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

## విష్ణువర్ధన్‌రెడ్డి చిత్రపటానికి నివాళులు



**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం రామారాం గ్రామానికి చెందిన అట్ల విష్ణువర్ధన్‌రెడ్డి ఇటీవల మరణించడంతో విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, ఆలేరు ఎంఎల్ఏ బీర్ల అయిలయ్య బుధవారం రామారం గ్రామానికి చేరుకొని అట్ల విష్ణువర్ధన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విష్ణువర్ధన్‌రెడ్డి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఈకార్యక్రమంలో ఆలేరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాదగిరిగౌడ్, మార్కెట్ కమిటి చైర్మన్ విమల వెంకటేశ్వర్లు, మండల పార్టీ అధ్యక్షులు రాంరెడ్డి, మాజీ ఎంపిపి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## బాల వైజ్ఞానిక ప్రదర్శన

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : తెలంగాణ రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి,జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 2,3 తేదీలలో జిల్లా కేంద్రం లోని ప్రభుత్వ డైట్ కళాశాలలో 2025/26 జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన, ఇన్‌స్పైర్ అవార్డ్స్ మేనక్ ప్రాజెక్ట్ పోటీలను సంయుక్తంగా నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి బి. బిక్షపతి తెలిపారు.ఎన్‌సిఇఆర్‌టి సూచించిన వివిధ ఇతివృత్తాలు,ఉఇతివృత్తాలపై విద్యార్థులు వారి నమూనాలను ఈ ప్రదర్శనలో ప్రదర్శించవచ్చని తెలిపారు. ఈ వైజ్ఞానిక ప్రదర్శనతో విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు , శాస్త్ర విజ్ఞానంపై ఆసక్తిని పెంపొందించేందుకు ఈ పోటీలు దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు.

## ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని ఈదులగూడలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయాన్ని బుధవారం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో నిర్మిస్తున్న కల్యాణమండపం పనులను పర్యవేక్షించారు. అదేవిదంగా మండపం చుట్టు నిర్మిస్తున్న సిసిరోడ్డు పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

